# ప్రజాసేవను తపస్సులా స్వీకరించాం..

- అపోహలను తొలగించి అభివృద్ధి చేశాం
- ప్రజలకు అందుతున్న అభివృద్ధి ఫలాలు
- కాంగ్రెస్ జీవితకాలం మోసపూరితమే
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- నిర్దిష్టమైన ప్రణాళికతో బీఆర్ఎస్ ముందడుగు
- సింగిరెడ్డి కృషితోనే వనపర్తి అభివృద్ధి
- చేసిన పనులను ప్రజల ముందుంచుతాం
- మళ్లీ నిరంజన్‌రెడ్డినే గెలిపించుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : తపస్సులా ప్రజా సేవను స్వీకరించి అభివృద్ధి పనులు చేపట్టామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన అనేక పథకాలపై ప్రతిపక్షాలు అపోహలతో కాలం గడిపాయని, ఆ అపోహలన్నీ పటాపంచలు చేసి అభివృద్ధిని అందించి ప్రజలకు భరోసా కల్పించామని మంత్రి సింగిరెడ్డి వెల్లడించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో కూడా తెలంగాణ అంత తలసరి ఆదాయం లేదని, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ లాంటి పెద్దరాష్ట్రాల్లో తలసరి ఆదాయం తెలంగాణ కంటే చాలా తక్కువగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేయడానికి 30 నుంచి 40 ఏండ్ల సమయం తీసుకునేవారని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అతి పెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడున్నరేండ్లలో పూర్తి చేసి వ్యవసాయానికి పెద్దపీట వేశామని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం రైతులు, వ్యవసాయం కోసం ఖర్చు చేయనంతగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలను వ్యయం చేసి రైతాంగానికి బాసటగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తన జీవితకాలమంతా ప్రజలను మోసం చేయడమే సరిపోయిందని మంత్రి విమర్శించారు. ఏ ప్రాజెక్టు చేపట్టినా దాదాపుగా 40ఏండ్ల పాటు నిర్మాణా లు చేపట్టి కాంగ్రెస్ కాలం గడిపేందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన జూరాల ప్రాజెక్టు ఇందుకు ఉదాహరణ అన్నారు. ఒక్కొక్క రాష్ట్రం లో ఒక్కో విధానాన్ని కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తుందని, పేరుకు జాతీయ పార్టీగా చెప్పడం మినహా ప్రాంతీయ పార్టీ మాదిరిగానే కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ అన్ని రాష్ట్రాలకు ఒకే విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్రంలో మరోసారి అధికారం చేపట్టడం ఖాయమని మంత్రి పేర్కొన్నారు.

### నిర్దిష్టమైన ప్రణాళిక ఉంది : రావుల

బీఆర్ఎస్ పార్టీకి నిర్దిష్టమైన ప్రణాళిక ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన రావుల తొలిసారి వనపర్తి బీఆర్ఎస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేయడంలో బీఆర్ఎస్ పట్టుదలగా వ్యవహరించిందన్నారు. వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. పట్టణంలోని రోడ్ల విస్తరణ సాహసోపేతంగా చేపట్టారని రావుల గుర్తు చేశారు. గతంలో తాము ఇద్దరం కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయని, ఇద్దరికి అవగాహన ఉందని రావుల వెల్లడించారు. న్యాయవాద వృత్తిలోనూ, రాజకీయంగానూ కలిసి పనిచేశామన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజల ముందుంచుతామని, మరోసారి నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని రావుల ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని తన అనుచరులంతా బీఆర్ఎస్ నాయకత్వంలో కలిసిపోయి ఐక్యంగా పని చేసుకుంటామని రావుల భరోసా ఇచ్చా రు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరముందని రావుల పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి, శిక్షణా తరగతుల కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పలుస రమేశ్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు మాణిక్యం, నందిమళ్ల అశోక్, నందిమళ్ల రమేశ్, రమేశ్ చంద్ర, ఉంగ్లం తిరుమల్, నందిమళ్ల శ్యాం, సత్యారెడ్డి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా మ్యానిఫెస్టో

- సంక్షేమంలో తెలంగాణ నెంబర్‌వన్
- అభివృద్ధిని చూసి ఆదరించండి
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు


బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ఉందని, సబ్బండ వర్గాలకు కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మె ల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంపద పెంచి పేదలకు పంచడమే బీఆర్ఎస్ సర్కారు విధానమని, గడిచిన పదేండ్ల పాలనలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే నిదర్శనమని తెలిపారు. ప్రజాహితం కోరి సీఎం కేసీఆర్ రైతుబంధు ఎకరానికి రూ.16వేలు, సౌభాగ్యలక్ష్మి పేరుతో బీపీఎల్ కుటుంబాలకు చెందిన పేదమహిళలకు నెలకు రూ.3వేలు, రూ.400లకే వంటగ్యాస్ సిలిండర్, జర్నలిస్టులకు వైద్య బీమా, రేషన్ సన్నబియ్యం, ఆసరా పెన్షన్లు పెంపు రూ.5016, అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేత తదితర ఎన్నో సంక్షేమ పథకాలు మ్యానిఫెస్టోలో పొందుపర్చారని తెలిపారు. నియోజకవర్గంలో తాను ఎంతో అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ప్రతి మండలం నుంచి 5వేల మెజార్టీ తీసుకరావాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి జూపల్లి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి ప్రజలు ముందుకు వస్తున్నారని, ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. కర్ణాటక మోడల్ పేరుతో ప్రజలను మభ్యపెడుతుందన్నారు. చిన్నంబాయి మండలంలో రామలింగేశ్వర టెంపుల్ భూములను మాజీ మంత్రి జూ పల్లి కాజేసి, బ్యాంకులకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రామన్నగుట్టు రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరలో చేపడతామని తెలిపారు. అనంతరం తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలేశ్ ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సమావేశంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాముయాదవ్, రైతుబంధు మండల కన్వీనర్ వెంకటయ్యానాయుడు, మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, బీఆర్ఎస్ నా యకులు అభిలాష్‌రావు, చంద్రశేఖర్‌నాయ క్, ఠాకూర్‌నాయక్, రఘుపతినాయు డు, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బాల య్యా, సర్పంచులు వెంకటయ్య యాద వ్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మ్యానిఫెస్టోను తప్పక అమలు చేస్తాం

- కేసీఆర్ బీమాతో 60లక్షల కుటుంబాలకు ధీమా
- ఇప్పటి వరకు రూ.73వేల కోట్ల 'రైతుబంధు' ఇచ్చాం
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పెబ్బేరులో 200మంది బీఆర్ఎస్‌లో చేరిక


బీజేపీ నాయకుడికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నీ తిరిగి అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సహారా ఫంక్షన్ హాల్‌లో పెబ్బేరు మండల బీజేపీ సీనియర్ నాయకుడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గోనెల సహదేవుడు ఆధ్వర్యంలో 200మంది ముదిరాజులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 93లక్షల కుటుంబాలు ఉండగా, 33లక్షల కుటుంబాలకు రైతుబీమాతోపాటు ఇతర బీమాలు వర్తిస్తున్నాయన్నారు. మిగితా 60లక్షల కుటుంబాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి.. ఆ కుటుంబాల యజమాని చనిపోతే రూ. 5లక్షలు వారికి అందేటట్లు ఈ పథకాన్ని రూపొందించామని చెప్పారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే కచ్చితంగా ఈ పథకాన్ని అమలు చేసి పేద కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. రైతుబంధు పథకానికి రూ.10వేల నుంచి రూ.16వేలకు పెంచుతామని, ఇప్పటికే 13 విడుతల్లో రైతుబంధు ద్వారా రూ. 73వేల కోట్లు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. ఆసరా పింఛన్‌ను రూ. 2016 నుంచి రూ.5016 వరకు పెంచడమే గాక, మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ. 3వేలు, రూ.400లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలన్నీ అమలు కావాలంటే బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. మత్స్యకారులు ఆధునిక పద్ధతులతో తమ వృత్తిని కొ నసాగించి ఆర్థికంగా బలోపేతం కావాలని, ఈ నేపథ్యంలోనే పెబ్బేరులో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. స్థానిక ముదిరాజు కులస్తులకు అన్ని సౌకర్యాలతో కూడిన కమ్యూనిటీ హాలు, జ్యోతీబాపూలే యువజన సంఘ భవనం నిర్మిస్తామని, అసంపూర్తిగా ఉన్న గంగమ్మ గుడిని పూర్తి చేయిస్తామని, ముదిరాజులు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు కోదండరాంరెడ్డి, మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట బాలరాజు, వనపర్తి మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, నాయకులు బుచ్చారెడ్డి, దిలీప్‌రెడ్డి, వనంరాములు, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, సుమతి, శ్యామల, గోల్డుబాలస్వామి, భారతి పాల్గొన్నారు.

## విజయానికి చిహ్నం విజయదశమి

- ఎస్పీ రక్షితామూర్తి

వనపర్తి టౌన్, అక్టోబర్ 22: చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమి పండుగను నిర్వహించుకుంటామని ఎస్పీ రక్షితామూర్తి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ సాయుధ దళ పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదివారం ఆయుధ పూజ నిర్వహించా రు. దసరా పండుగను పురస్కరించుకొని ఆయుధాలు, వాహానాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే పోలీసులకు దుర్గాదేవి అనుగ్రహంతో విజయం వరించాలని ఆయుధ పూజ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలందించి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు పోలీసులపై ఉండాలని ఎస్పీ కోరారు. అదేవిధంగా జిల్లా పోలీస్ సిబ్బందికి, ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### కోటలో సంస్థానాధీశుల పూజలు..

జిల్లా కేంద్రంలోని సంస్థానాదీశుల కోటలో రాజారామేశ్వరరావు వం శీకులు ఆయుధ పూజ నిర్వహించారు. ఆనాటి యుద్ధంలో వినియోగించిన కత్తులు, ఇతర యుద్ధ సామగ్రికి రాజారామేశ్వరరావు వంశీకులు పూజలు నిర్వహించారు.

### దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎస్పీ దంపతులు

దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి వేడుకల్లో ఎస్పీ రక్షితామూర్తి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్పీ దంపతులకు శాలువాతో ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సాయుధ దళాధిపతులు శ్రీనివాస్, అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్, కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్సైలు, అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు నాగేశ్ ఇతర సభ్యులు ఉన్నారు.

